కథ

# తొందరపడ్డ కోయిల


ఎన్.కె.రామారావు

ఆ సాయంకాలం గిరాకీ లేక రత్నగర్భ మెడికల్ షాపు ఖాళీగా వుంది. ఒకసారి అటూ ఇటూ చూసి ఆనంద్ హడావిడిగా షాపులో ప్రవేశించాడు. క్యాష్‌బల్ల దగ్గరున్న ఓనర్‌ని చూసి అచ్చు హిందీ విలన్ సాయాజీ షిండేలా వున్నాడనుకున్నాడు.

''ఏం కావాలబ్బాయి'' షాపతను లాలనగా అడిగాడు. చూసీ చూడ గానే ఇతన్ని కాలేజీ స్టూడెంటుగా సరిగ్గా అంచనా కట్టాడు.

''నాకూ.. నాకూ..'' ఆనంద్ నసుగుతున్నాడు.

''నాకు తెలుసు. నీకు యాసిడ్ బాటిల్ కావాలి. మా షాపులో ఉంది. అయినా అది నీకు అమ్మొచ్చు అని పోలీసాఫర్‌నుంచో, మీ ప్రిన్సిపాల్‌నుంచో ఓ కాయితమ్ముక్క పట్టుకొస్తేనే నీకు అమ్మేది''





''ఛా..ఛా..ఛా. యాసిడ్ వద్దు. అది ప్రేమ విఫల మయినప్పుడు. నేనూ.. నేనూ సఫల ప్రేమికుడిని. నాకూ.. నాకూ.. ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు. బైది బై మీరు అచ్చు సాయాజీ షిండేలా వున్నారు. మిమ్మల్ని షిండే అంకుల్ అని పిలవడా నికి తహతహలాడుతున్నాను''

''షిండే సాబ్ అను. అంకుల్ అంటే నాకు తిక్క రేగుద్ది. దాంతో నీ బొక్కలు విరగ్గొట్టి హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేస్తానో లేకుంటే నీ ముఖం మీద యాసిడే పోస్తానో నాకే తెలియదు. ముఖం కాలింతర్వాత అద్దంతో పని లేదబ్బాయి. ముంద స్తుగా చెప్పేస్తున్నాను''

''షిండే సాబ్.. నేను మాక్లాస్ అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆమె అచ్చు డెర్బీ మెరేవియాలా గుంటుంది''

''డెర్బీ- అదెవత్తే''

''ఎవరో నాకూ తెలియదు సార్. నాకు నచ్చిన అమ్మాయికి ఆ పేరు పెట్టుకుంటాను. పేరు బాగుందా సార్?''

"ఏడ్చినట్టుంది''

"డెర్బీ నన్ను ఘాటుగా ప్రేమిస్తోంది. నా సెల్ ఫోను కెమెరాతో ఆమెకు తెలిసి కొన్ని ఆమెకు తెలియక కొన్ని ఫోటోలు తీసి సేవ్ చేశాను. లేఖలు ఎక్స్ఛేంజి చేసుకున్నాం. ఎస్ఎమ్ఎస్‌లు పంపుకున్నాం. అలాంటిది యాసిడ్తో నాకింక పని ఏముంది.''


"మరి నీకు ఏం కావాలి?''

"మరే.. మరే..నాకూ నాకూ'

"ఏంటబ్బాయి నానుస్తావు. ఢంకా బజాయించి మరీ అడుగు''

"షిండే సాబ్. మీరు పెద్దవారు. ఎలా అడగాలో తెలియక సిగ్గుతో చితికి పోతున్నాను''

"వయసు చూసి బెంబేలు పడకు. నీ ప్రేమ వృత్తాంతం దాచకుండా చెప్పు. చదువుకునే రోజుల్లో నేనూ ప్రేమించాలే. ఆవిడ ఒప్పుకోలేదు. అది



వేరే విషయం. కాకపోతే మాకు అప్పటికి యాసిడ్ ఉపయోగాలు తెలియవు''

ఆనంద్‌కు ధైర్యం వచ్చింది. "డెర్బీ నా దేవత. నా కోసం వాళ్ల నాన్నకు బురిడీకొట్టి సిన్మాలకు షికార్లకు వచ్చేసేది. నేను ఏవో గిఫ్టులూ పాకెట్ మనీ.. సారీ. జాకెట్ మనీ ఇచ్చేవాడిని''

"జేబులు కొట్టటం.. తాళాలేసిన ఇళ్లు దోచుకోవటం లాంటి చిల్లర మల్లర జాబులేమన్నా చేస్తున్నావా'' షిండే అనుమానంగా అన్నాడు.

"ఛీ ఛీ.. అది మా ఇంటా వంటా లేదు. నన్ను డాక్టర్ని చేయాలని మానాన్న అడిగినంత డబ్బు పంపిస్తాడు''

"సరే డాక్టర్‌వే కా.. యాక్టర్‌వి కాబాకు. డాక్టర్‌వి అయితే నీ దగ్గరకొచ్చే వాళ్లే చస్తారు. అదే యాక్టర్‌వి అయితే తొంబ తొంబగ చస్తారు. తర్వాతి కథ చెప్పు''

"ఏముంది నా డెర్బీ.. నా జేబులు ఖాళీ చేయిస్తుందిగానీ సెక్సుకు మట్టుకు ఒప్పుకోవటం లేదు. కిసెస్‌కి పర్మిషనిచ్చింది. ఎన్నాళ్లు కేవలం కిసెస్‌తో సరిపుచ్చుకుంటాం సాయాజీ గారు'' ఆనంద్ ఉద్వేగంగా ఏడ్చేశాడు. అది చూసి షిండే కూడా ఏడ్చేశాడు.

"అలాంటిది నా డెర్బీకి ఈ రోజు పుట్టిన రోజట. వేరే ఎవర్నీ పిలవటం లేదట. నన్నొక్కడినే వాళ్లింటికి రాత్రి ఎనిమిది గంటలకు రమ్మంది. వాళ్ల అమ్మా నాన్నా తమ్ముడిని పరిచయం చేస్తుందిట. భోజనాలయింతర్వాత నేను బహిరంగ నిష్క్రమణ చేసి రాత్రి పదిగంటలకు మళ్లీ వెళ్లాలిట. వీధి గుమ్మం జారేసి వుంచుతుందట. నేను తన గదిలోకి వెళ్లి కార్యక్రమం ముగించుకొని బయటికి వెళితే తను వీధి గుమ్మం మూసి గడియ వేసుకుంటుందట''

"భేష్. నీ డెర్బీ తెలివి కలదే కాదు. సాహసి కూడా నోయి. నీకు నా శుభాకాంక్షలు'' షిండే ఆనంద్ అదృష్టాన్ని అభినందించాడు. "మరి నా షాపుకెందుకు వచ్చినట్లో''

"అదా మరేం లేదు. జనం లేక దివాలాగా వుండే షాపులు వెతుకుతుంటే మీ షాపు కనిపించింది''

షిండేకు కోపంవచ్చినా అణచుకున్నాడు"ఇంతకూ ఏం కావాలో చెప్పు'' అన్నాడు.

"మరే! ఆ అమ్మాయి సెక్సుకు యాక్సెప్ట్ చేసినా అవిడకు రేపు ఏ అవమానాలు ఎదురు కాకుండా చూడాల్సిన బాధ్యత నామీద లేదా?''

"వుంది వుంది'' అంగీకరించాడు.

"అందుకే నా డెర్బీకి కడుపో కాకర కాయో రాకుండా జాగ్రత్త పడాలని మీ వద్దకు వచ్చాను. ఒకవేళ అలాంటిదేమన్నా అయితే గియితే డెర్బీ మొహం మళ్లీ మనం చూడం కదా'' బిగ్గరగా నవ్వాడు.

షిండేకి ఈ నవ్వు ఈ అభిప్రాయాలు ఏమాత్రం నచ్చలేదు. "అదేంటోయి. ఆ పిల్లను పెళ్లాడటం నీ నైతిక బాధ్యత''

"షిట్ నైతికతా లేదు. గాడిద గుడ్డూలేదు. నా కట్లాంటి బంధాలు ఇష్టం వుండవు''

"సరే. ఇప్పుడేం కావాలి? వయాగ్రాల్లాంటివి నీకిప్పటినుంచే ఎందుకు?''

ఆనంద్‌కు రోషం వచ్చింది. "ఛా..ఛా..నన్ను అలా లెక్కేశారా? నాకు కండోమ్స్ కావాలి. అవిడకూ మంచిది. నాకూ మంచిది''తన ముందు చూపు తెలియచేశాడు.

షిండే సైలెంటుగా నాలుగు కండోములు తీసి ఇచ్చాడు. ఆనంద్ బైబై చెప్పి వెళ్లిపోయాడు.

"ఏంటో ఈ కాలపు పిల్లలు'' షిండే సాలోచనగా నిట్టూర్చాడు.

***

సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలకు డెర్బీ ఇంటికి వెళ్లాడు ఆనంద్. అమ్మాయి సంతోషంగా ఆహ్వానించి తల్లికీ తమ్ముడికీ పరిచయం చేసింది. డెర్బీ తల్లి యజమాని రావటానికి అలస్యం అవుతుందని భోజనాలు కానిద్దామని ప్రతిపాదించింది.

డెర్బీ, డెర్బీ తమ్ముడూ భోజనాలు కానిచ్చి ముందు హాల్లో కూచుని మాట్లాడుకుంటున్నారు. డెర్బీ తండ్రి గుమ్మం దగ్గర నిలబడ్డాడు. బలిష్టమైన శరీరం. డెర్బీ తండ్రికి ఆనంద్‌ను పరిచయం చేసింది. ఆనంద్ రెండు చేతులు జోడించి నమస్కారంచేసి వినమ్రంగా తల వంచుకున్నాడు. అలా వంచుకున్న వాడు అయిదు నిమిషాలపాటు అలాగే అవనత శిరస్సుతో జోడించిన చేతుల్తో ఉండిపోయాడు.

డెర్బీ ఆనంద్ చెవుల దగ్గర నోరుపెట్టి "నీకు పెద్దలంటే ఇంత భక్తి అని ఇప్పుడే తెలిసింది. ఇకలే'' అంది.

ఆనంద్ ఆపాదమస్తకం వణకుతూ"సాయాజీ షిండే.. మీ నాన్న అని నాకు ఇప్పుడే తెలిసింది'' అంటూ గుమ్మం దగ్గరున్న షిండేని తప్పించుకుని రోడ్డుమీద పడి పరుగు ప్రారంభించాడు.

"పకడో కుత్తేకో..గోలీ చలా దూంగా సాలేకో'' అంటూ షిండే కేకలు భయంకరంగా వినిపిస్తున్నాయి.

*

రచయిత చిరునామా:
ఎస్.కె.రామారావు
సూపరింటెండెంటు
III ఎడిషనల్ జిల్లా కోర్టు, నల్లగొండ జిల్లా.